సాక్షి నల్లగొండ

శుక్రవారం ౹ 12 ౹ జూలై ౹ 2024



పోలీసులకు శిక్షణ కీలకం

పోలీసులకు శిక్షణ ఎంతో కీలమని రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్, అదనపు డీజీపీ అభిలాష బిస్త్ అన్నారు. - 8లో



'ఓజో'లో అగ్ని ప్రమాదం

చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం శివారులోని ఓజో పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. - 8లో

గరిష్టం / కనిష్టం

33°/ 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఉద్దీపన స్కూల్ ప్రారంభం

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని వాసవి కళాశాల భవనంలో ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీరేశం ఏర్పాటు చేస్తున్న విజ్ఞాన విద్యామందిర్ (వీవీఎం) ఎయిడెడ్ పాఠశాలను శుక్రవారం తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు ఎమ్మెల్యే ఈ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీరేశం కూడా హాజరవుతారని తెలిపారు.

మెడికల్ కోడింగ్‌పై విద్యార్థులకు అవగాహన



కోడింగ్ అవగాహనలో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పరిధిలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో సైన్స్ కళాశాల, టాస్క్ ఆధ్వర్యంలో ఎంజీయూ విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో ఉపాధి అవకాశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా త్రీఎక్స్ సంస్థ హైదరాబాద్ ప్రతినిధులు విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలు నివృతి చేశారు. మెడికల్ కోడింగ్ రంగంలో మంచి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ మహ్మద్ సమీహుల, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌సాగర్, రామచందర్‌గౌడ్, శ్రావ్య, స్వామి, శ్రీను, సమరీన్, కాజ్మీ, వాగ్దేవి, ఇందిర పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కేవీఎల్

నల్లగొండ టౌన్ : మాదకద్రవ్యాల (డ్రగ్స్) నుంచి యువతను కాపాడడంతో పాటు ప్రపంచ శాంతి పరిరక్షణకు ప్రతిఒక్కరం కృషిచేద్దామని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని టీఎన్‌జీవో భవన్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఐక్యరాజ్య సమితి వెంటనే ఆపాలని కోరారు. ఆగస్టు 16 నుంచి 18వ తేదీ వరకు ఢిల్లీలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ సమితి సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశంలో మల్లేపల్లి ఆదిరెడ్డి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, కట్టా వెంకట్‌రెడ్డి, అనంతుల శంకరయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి, ప్రద్యుమ్నారెడ్డి, నాగసేనారెడ్డి, ముక్క ఈశ్వరయ్య, పసల శౌరయ్య, ఎల్‌వీ.యాదవ్, సత్యనారాయణ, వెంకన్న, బ్రహ్మచారి, శ్రీనివాస్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు అడ్వయిజరీ కమిటీలను పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లేబర్ విభాగంలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ బోర్డులో రూ.5500 కోట్ల నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నర్సింహ, సైదాచారి, సత్యనారాయణ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు


నల్లగొండ టౌన్: స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల, కస్తూరిబా గాంధీ సంక్షేమ హాస్టళ్లకు నాణ్యమైన బియ్యం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్ , కంభంపాటి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కాలర్ షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నందున పేద విద్యార్థులకు కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ బాలికల కోకన్వీనర్ కుంచం కావ్య, లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్, రమేష్, సంపత్, యువరాజు, రావణ్, జగదీశ్, వీరన్న, ప్రసన్న, అజయ్, నరేష్, సన్ని, కార్తిక్, శివ పాల్గొన్నారు.

ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నాం

పదిహేను రోజుల్లో 10 వేలకుపైగా ధరణి సమస్యలు పరిష్కారం

- గురువారం ఒక్క రోజే 600..
- పెండింగ్‌లో 19,100 భూ సమస్యలు
- మూడు నెలల తర్వాత పెద్ద సమస్యలు పరిష్కరిస్తాం

'సాక్షి' ఇంటర్వ్యూలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: 'జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పపరిష్కారానికి పదిహేను రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. కలెక్టరేట్‌లో రోజుకో డివిజన్‌లోని తహసీల్దార్లు, సిబ్బందితో చర్చించి పరిష్కారం చూపుతున్నాం. గురువారం ఒక్కరోజే 600 సమస్యలు పరిష్కరించాం. ఈ పదిహేను రోజుల్లో దాదాపు 10 వేల పైచిలుకు భూ సమస్యలు మాన్యువల్‌గా, మరో 8 వేల వరకు ఆన్‌లైన్‌లో పరిష్కరించాం' అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి చెప్పారు. భూ సమస్యల పరిష్కారంతోపాటు విద్య, వైద్యం అంశాలపై కలెక్టర్ గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రతి సమస్యకూ ఆర్డర్ కాపీ ఇస్తున్నాం

ధరణిలో పరిష్కారం కాని సమస్య ఉంటే అది ఎందుకు ఏ కారణం చేత పరిష్కారం కావడం లేదో ఆ ఆర్డర్‌లో పొందు పరచడంతో పాటు అదే సమస్యను ఆన్‌లైన్‌లో కూడా చేస్తున్నాం. పరిష్కారమైన భూ సమస్య కూడా ఆర్డర్ కాపీ ఇస్తున్నాం. ప్రధానంగా 2005 రికార్డులను పరిశీలించి పట్టాదార్‌కు భూమి ఎవరి దగ్గర కొనుగోలు చేశాడు...లేకపోతే ఎవరి నుంచి వారసత్వంగా వచ్చిందో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఒకవేళ ఎక్స్‌టెండ్ కన్నా ఎక్కువ భూమి ఉంటే అందులో న్యాయపరంగా ఎవరైన లేనట్లయితే వారి పేరును తొలగించి దరఖాస్తు చేసుకున్న వ్యక్తిది న్యాయపరంగా ఉంటే వారిని రికార్డుల్లో చేర్చుతున్నాం.

విద్య, వైద్యంపైనా ప్రత్యేక దృష్టి

జిల్లాలో ప్రధానంగా విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. హెల్త్ సబ్ సెంటర్ల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల సమస్యలతో పాటు హైపర్ టెన్షన్, షుగర్, ఫీవర్ తదితర వాటికి మందులు ఇచ్చేలా చూస్తాం. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఉన్నందున మరిన్ని ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకోబోతున్నాం. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందించేలా చూస్తాం. ఎన్నికల కారణంగా కాస్త స్తబ్ధుగా ఉన్న ప్రజాపాలనను మెరుగుపరుస్తాం. రెవెన్యూ కార్యాలయాల్లో భూ సమస్యలు, ఇతర సర్టిఫికెట్ల జారీ వంటి వాటిలో ఇబ్బందులు జరగకుండా చూస్తున్నాం. పీడీఎస్ బియ్యం పంపిణీపై దృష్టి సారిస్తున్నాం. మండల స్థాయిలోనూ ప్రజావాణి పక్కాగా జరుగుతుంది. సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగమంతా ఉత్సాహంగా పనిచేస్తోంది.

మొదట చిన్న సమస్యల పరిష్కారం..

ఎలాంటి పంచాయతీ లేని వాటితో పాటు రికార్డుల పరంగా ఇబ్బంది లేని చిన్నచిన్న సమస్యలను మొదటగా పరిష్కరిస్తున్నాం. ప్రధానంగా 2005 టైటిల్‌ను పరిశీలించడంతో పాటు పొజిషన్‌లో ఉన్నాడా లేదా ఆర్ఎస్ఆర్ ఎక్స్‌టెంట్, ఇద్దరు వ్యక్తుల మధ్య పంచాయతీలు ఏమైనా ఉన్నాయా.. ప్రభుత్వం ఆ భూములను సేకరించిందా అనే ఈ అయిదు రకాల వాటిని పరిశీలించి ఎలాంటి ఇబ్బంది లేకపోతే వెంటనే పరిష్కరిస్తున్నాం.

ఒకసారి వచ్చిన దరఖాస్తు.. మళ్లీ రాకుండా..

ఒకసారి వచ్చిన భూ సమస్య దరఖాస్తు తిరిగి రెండోసారి రావద్దనే ఉద్దేశంతో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఒకవేళ పరిష్కారం కాకపోతే ఏ కారణం చేత పరిష్కరించలేమో అతనికి లిఖిత పూర్వకంగా సమాచారం అందిస్తున్నాం. ఒకవేళ ఒకే సమస్యపై రెండోసారి దరఖాస్తు వచ్చిందంటే ఆ సమస్యకు సంబంధించి కొత్తగా ఏవైనా ఆధారాలు పొందుపరిస్తే తప్ప రెండోసారి దరఖాస్తు పరిశీలించబడదు. ముఖ్యంగా కృష్ణపట్టె ఏరియాలోని చందంపేట, పెద్దవూర, నిడమనూరు, త్రిపురారం, దామరచర్ల తదితర మండలాల్లో వందల ఎకరాల్లో భూ సమస్యలున్నాయి. కొన్ని ఫారెస్టు సమస్యలు కూడా ఉన్నాయి. ఫారెస్టు సెంట్రల్ గెజిట్ ఉన్న వాటిని తొలగించుకుంటే వాటి పరిష్కారానికీ కృషి చేస్తాం. మిగతా పెద్ద సమస్యలన్నింటినీ మూడు మాసాల తర్వాత పరిష్కరిస్తాం.

లక్ష్యానికి మించి మొక్కలు నాటాలి



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం అయన తిప్పర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు, వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు మొక్కలు దోహద పడతాయన్నారు. అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉన్న చోట అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 66 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా ఆయా స్థలాల్లో, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని కోరారు. అంతకుముందు మంత్రి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. తనతో పాటు, జిల్లా కలెక్టర్ కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు వాటర్ ట్యాంకు మంజూరు చేశారు. నాలుగు టాయిలెట్లను, ముగ్గురు స్కావెంజర్లను తక్షణమే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డిజిటల్ బోర్డుపై తరగతులను పరిశీలించారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్

గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

ప్రభుత్వంతోపాటు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడెం గ్రామంలో దివంగత రామచంద్రారెడ్డి, భారతీల జ్ఞాపకార్థం నిర్మించిన లైబ్రరీ, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో అందరికీ ఉపయోగపడేలా లైబ్రరీ, అంగన్‌వాడీ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి శిలార్‌వియాగూడేనికికి సబ్ స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా, వారం రోజుల్లో ఫౌండేషన్ వేస్తామని, అవసరమైన స్థలం చూడాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, డీఈఓ భిక్షపతి, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ భూమయ్య, ఆర్డీఓ రవి, పాశం రాంరెడ్డి, నాగులంచ విజయలక్ష్మీలింగారావు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్: అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు జనాభాను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధిక జనాభా వల్ల పేదరికం , నిరక్షరాస్యత, వనరుల లేమి వంటివి ఏర్పడతాయన్నారు. జనాభా పెరుగుదలను నియంత్రిస్తే నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు తలెత్తవన్నారు. ప్రస్తుతం దేశంలో చాలా మంది ఒకరు, లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటున్నారని, అందరూ అదే సూత్రాన్ని పాటించాలన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ సేవలు అందించిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, బీఎల్ఓ హరికృష్ణ, డీఐఓ పద్మ, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి అరుంధతి, డీఓ డీటీ గీతావాణి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, నర్సులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నల్లగొండ: వనమహోత్సవంలో భాగంగా వారం రోజులపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో విరివిగా మొక్కలు నాటి బాధ్యతతో సంరక్షించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. వివిధ అంశాలపై సమీక్షించి ఆయా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర ఆయా అంశాల వారీగా లక్ష్యాలు, సాధించిన పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో అధికారులు రాజశేఖర్, నాగిరెడ్డి, ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్తంభించిన సేవలు
- ఈకేవైసీలో తీసుకోని సబ్ రిజిస్ట్రార్ల వేలిముద్రలు
- రిజిస్ట్రేషన్ చలాన్లు చెల్లించకపోవడంతో ఆగిన రాబడి



నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సెంట్రల్ సర్వర్‌లో వచ్చిన సాంకేతిక ఇబ్బందుల కారణంగా వేలిముద్ర తీసుకోని పరిస్థితి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈకేవైసీలో వేలిముద్ర తీసుకోలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ప్లాట్లు, ఇళ్లు, భూములు, ఇతర వాణిజ్యపరమైన ఆన్‌లైన్ చలానాలు కట్టే వీలు లేకపోవడతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. అయితే వ్యవసాయ భూములకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అయితే రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ అయ్యి అమ్మకానికి సంబంధించి డబ్బులు చెల్లిస్తున్నందున వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు ఆగినాముందే రాబడి వచ్చింది. కానీ, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో అమ్మకం, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు.

ఈకేవైసీ అనుసంధానంలో సమస్య

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో నల్లగొండ, యాదగిరిగుట్ట, బీబీనగర్, చౌటుప్పల్, నకిరేకల్, నిడమనూరు తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 70 నుంచి 100 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. అయితే గురువారం ఆధార్ ఈకేవైసీ అనుసంధానంలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేలిముద్రను తీసుకోకపోవడంతో అటు రిజిస్ట్రేషన్లకు సంబంధించి చలాన్ల చెల్లింపుతో పాటు రిజిస్ట్రేషన్లు కూడా ఆగిపోయాయి.

రూ.10 కోట్ల రాబడి ఆగింది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఒక్కో రోజు రూ.10 కోట్లపై చిలుకే ఆదాయం వస్తుంది. అయితే రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి సర్వర్లు పనిచేయకపోవడంతో చలానాలు చెల్లించలేని పరిస్థితి. దీంతో రిజిస్ట్రేషన్లు కాక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజు వచ్చే రూ.10 కోట్ల రాబడి ఆగిపోయింది.

తహసీల్దార్ కార్యాలయాల్లో పడిగాపులు

తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అయితే ఒకరోజు ముందుగానే కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి స్లాట్‌బుక్ చేసుకుంటారు. గురువారం ఏర్పడిన సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయి. అమ్మకం, కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు ఎదురుచూసి నిరాశతో ఇంటి బాటపట్టారు.

పెండింగ్ కేసులు క్లియర్ చేయాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం: పెండింగ్ కేసులు త్వరగా క్లియర్ చేయాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి పోలీస్ అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారం విషయంలో అవసరమైతే న్యాయమూర్తులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, రాజశేఖర్ రాజు, గిరిబాబు, సైదా, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఫర్నిచర్ వేలం

జిల్లా పోలీస్ కార్యాలయంలోని పాత క్వార్టర్స్‌కు సంబంధించిన ఉడెన్ డోర్స్, ఉడెన్ విండోస్, ఇతర ఫర్నిచర్, పాత ఇనుప సామగ్రిని ఈ నెల 13న బహిరంగం వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ : 8712670171 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

యాదాద్రి ప్లాంట్ పనులు త్వరగా పూర్తిచేస్తాం

- జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్



ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్

మిర్యాలగూడ: యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టు 25 నాటికి ఒక యూనిట్, సెప్టెంబర్ 25 నాటికి మరో యూనిట్ ద్వారా మొత్తం రెండు యూనిట్ల నుంచి 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనను మొదటి దశలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అనంతరం పవర్ ప్లాంట్‌లోకి బొగ్గు రవాణా కోసం చేపడుతున్న రైల్వే లైన్ పనులతోపాటు బాయిలర్లు, కంట్రోల్‌రూమ్, కూలింగ్ టవర్లు, టర్బైన్లను, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లను పరిశీలించారు. అనంతరం జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన వెంట డైరెక్టర్ సచిదానందం, ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్, చీఫ్ ఇంజనీర్లు సమ్మయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, డీఈ హనుమాన్, ఎస్ఐ ఇరుగు రవి తదితరులు ఉన్నారు.

15న టీటీసీ అభ్యర్థులకు మార్కుల మెమోలు

నల్లగొండ: ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ)లో డ్రాయింగ్, టైలరింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈనెల 15వ తేదీన ఒరిజినల్ మార్కుల మెమోలు అందజేయనున్నట్లు డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాసిన అభ్యర్థులు హాల్‌టికెట్లు చూపి నల్లగొండ డీఈఓ కార్యాలయంలో ఒరిజినల్ మార్కుల మెమోలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



స్వయం ప్రతిపత్తి హోదాపత్రాలను చూపుతున్న అధ్యాపకులు

కోదాడ : కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) ఈ విద్యాసంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల వరకు స్వయం ప్రతిపత్తిని ప్రకటించింది. ఈ మేరకు యూజీసీ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ గోపిచంద్ మెరుగు మహాత్మాగాంధీ యూనివర్సిటీకి సమాచారం అందించారు. 2024–25 విద్యాసంవత్సరం నుంచి 2028–2029 విద్యా సంవత్సరం వరకు ఈ అనుమతి లభించనుంది. దీనిని రెన్యూవల్ చేసుకోవడానికి గడువు ముగిసే సమయానికి మూడు నెలల ముందు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. తమ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడం పట్ల ప్రిన్సిపాల్ ఎం.నాగు, అధ్యాపకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు.

పులి సంచారం వదంతులను నమ్మొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్

చింతపల్లి : చింతపల్లి మండలంలోని అనాజిపురం గ్రామంలో రెండు రోజుల నుంచి పులితో పాటు పులి పిల్లలు సంచరిస్తున్నాయన్న వదంతులను గ్రామస్తులు నమ్మొద్దని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన గ్రామాన్ని సందర్శించి రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో అడవి జంగిపిల్లులు సంచరిస్తున్నాయని, పులి ఉన్నట్లు వస్తున్న వదంతులను నమ్మొదని, అది కేవలం అడవి పిల్లి మాత్రమేనన్నారు. అటవీ ప్రాంతం లేనందున పులి వచ్చే అవకాశం లేదన్నారు.

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం జరిగింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బాలిక (13) స్కూల్‌కు వెళ్లలేదని తల్లి మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి ఉరివేసుకుని వేలాడుతున్న కూతురును చూసి బోరున విలపించింది. స్థానికుల సహాయంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

పరారీలో నిందితులు

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ పరిధిలోని చింతలగూడేనికి కొత్త కళ్యాణి ఆత్మహత్యకు కారణమైన నిందితులు పరారీలోనే ఉన్నారు. ఇద్దరు యువకులు వాట్సాప్, సోషల్ మీడియాలో కళ్యాణి ఫొటోలను స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరించడంతో ఆమె కలుపు నివారణ మందు తాగి నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కల్యాణి మృతికి కారణమైన యువకులను పట్టుకోవడానికి పోలీసులు మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల బంధువుల ఇళ్లలో విచారించడంతో పాటు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఒకరైన కొమ్మనబోయిన మధు నిద్రమాత్రలు మింగి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఓజో అగ్రికేర్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్లు పేలడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- కూలిపోయిన ప్రొడక్షన్ యూనిట్ షెడ్
- పూర్తిగా దెబ్బతిన్న భవనాలు, యంత్రాలు, ముడిసరుకు
- రూ.40కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా



ఓజో అగ్రికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోని ప్రొడక్షన్ బ్లాక్‌లో ఎగిసిపడుతున్న మంటలు



అగ్నిప్రమాదం కారణంగా దెబ్బతిన్న ముడిసరుకు

చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం రెవెన్యూ పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో గల ఓజో అగ్రి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రొడక్షన్ బ్లాక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. పరిశ్రమ నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో ఏర్పాటు చేసిన ఓజో అగ్రి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వ్యవసాయానికి సంబంధించిన పలు రకాల క్రిమిసంహారక మందులను ఉత్పత్తి చేస్తారు. ఈ పరిశ్రమలో సుమారు 70మంది పనిచేస్తున్నారు. పరిశ్రమలో ఉదయం ఉత్పత్తి జరుగుతుండగా.. రాత్రి సమయంలో మరుసటిరోజు ఉదయానికి అవసరమైన ప్రొడక్షన్‌ను మిక్షర్ యూనిట్ల ద్వారా తయారు చేసుకుంటారు. రోజుమాదిరిగానే బుధవారం రాత్రి ఉద్యోగులు, కార్మికులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆరుగురు సిబ్బంది మాత్రం రాత్రి విధుల్లో ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు

అర్ధరాత్రి 1.30గంటల సమయంలో ప్రొడక్షన్ బ్లాక్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో మంటలను గమనించలేదు. అనంతరం దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడుతుండడంతో ప్రధాన ద్వారం వైపున ఉన్న సిబ్బంది గమనించి కంపెనీ నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద తీవ్రతను పరిశీలించి మంటలను అదుపు చేసేందుకు చౌటుప్పల్‌తో పాటు రామన్నపేట, హయత్‌నగర్, ఎల్‌బీనగర్, భువనగిరి, ఆలేరు నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించారు.

ముడి సరుకు, రియాక్టర్లతోనే పెరిగిన ప్రమాద తీవ్రత

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పరిశ్రమలో పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతోంది. బుధవారం రాత్రి ప్రొడక్షన్ బ్లాక్‌లో 100రకాల ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకు ఉంది. ఆయా ఉత్పత్తులను గురువారం ప్యాకింగ్ చేయాల్సి ఉండేది. ప్యాకింగ్ చేసే అట్టలకు అంటుకున్న మంటలు ఉధృతం కావడంతో పక్కనే ఉన్న 8 రియాక్టర్లు పేలిపోయాయి. దీంతో ప్రొడక్షన్ బ్లాక్‌తో పాటు పక్కనే ముడి సరుకు భద్రపరిచే మరో బ్లాక్‌కు మంటలు అంటుకుని కూలిపోయాయి. ఆరు ఫైర్ ఇంజన్‌లు, స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకర్ల ద్వారా గురువారం ఉదయం 10గంటల ప్రాంతంలో మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే కూలిపోయిన శిథిలాల కింద మళ్లీ మంటలు వ్యాపించడంతో వాటిని అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ధ్వంసమైన భవన శిథిలాలను జేసీబీలతో కూల్చివేశారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రూ.40కోట్లకు పైగా నష్టం..

ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 40కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. రవికుమార్ తెలిపారు. 100రకాల ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకు ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిందన్నారు. దాని విలువ సుమారు రూ.30కోట్లు ఉంటుందని, అదేవిధంగా రూ.12కోట్ల విలువైన యంత్రాలు, రూ.10కోట్ల విలువైన వివిధ భవనాలు, షెడ్లు కూలిపోయాయని ఆయన పేర్కొన్నారు. సీఐ అశోక్‌రెడ్డి దగ్గరుండి మంటలను ఆర్పించే చర్యలు చేపట్టారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు ప్రొడక్షన్, ముడి సరుకు భద్రపరచే ప్లాంట్లను పరిశీలించి ప్రాథమిక అంచనా రూపొందించారు. అదేవిధంగా పరిశ్రమను వివిధ శాఖల అధికారులు సైతం సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన యంత్రాలు



పూర్తిగా కూలిపోయిన షెడ్డు

పోలీసులకు శిక్షణ ఎంతో కీలకం

- తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

నల్లగొండ క్రైం: పోలీసులకు శిక్షణలో ఎంతో కీలమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో ఉపయోగపడతాయని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని, అన్నెపర్తి 12వ బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్, బెటాలియన్ కమాండెంట్ ఎన్‌వీ సత్య శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. పోలీస్ శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో ఉపయోగపడతాయన్నారు. పోలీసు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అందుతున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే అవకాశం కేవలం పోలీసు శాఖకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీటీసీ వైస్ ప్రిన్సిపాల్ విఠల్‌రెడ్డి, ఆర్‌ఐ హరిబాబు, ఎస్‌ఐలు క్రాంతికుమార్, బాబు, శ్రీనివాస్, భరత్, అఖిల్, అసిస్టెంట్ కమాండెంట్లు వెంకటేశ్వర్లు, రవిచంద్రన్, పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్తు

- బీజేపీ నేత రాంచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

సూర్యాపేట : ప్రజల ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీదే భవిష్యత్తు అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత రాంచందర్‌రావు అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని బాలాజీగార్డెన్‌లో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయిందన్నారు. పార్టీని రెండో స్థానంలోకి తీసుకొచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ నుంచి గ్రామ, మండల స్థాయి నాయకులందరూ బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజుకు నాలుగు గెజిటెడ్ ఉద్యోగాలు

- డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్, గురుకుల లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపిక
- కృష్ణంరాజు స్వస్థలం శాలిగౌరారం మండలం అడ్లూరు
- ప్రస్తుతం బాసర ట్రిపుల్ ఐటీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు



కృష్ణంరాజు

శాలిగౌరారం: ప్రభుత్వ ఉద్యోగ సాధనలో ప్రస్తుతం పెరిగిన తీవ్రమైన పోటీ నేపథ్యంలో ఒక ఉద్యోగాన్ని పొందడమే కష్టంగా మారిన తరుణంలో ఒక వ్యక్తి ఒకటి, రెండు కాదూ ఏకంగా నాలుగు ప్రభుత్వ గెజిటెడ్ ఉద్యోగాలను సాధించాడు. వివరాలలోకి వెళ్తే.. శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన వరికుప్పల కృష్ణంరాజుది వ్యవసాయ కుటుంబం. ఇంటర్మీడియట్ మినహా ఇస్తే ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం చేశాడు. 2008లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తిచేసిన వెంటనే 2008లో బాసర ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధుల్లో చేరి నేటి వరకు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో భాగంగా ఇటీవల వెలువడిన పలు ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్, గురుకుల లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. అందులో గురుకుల డిగ్రీ లెక్చరర్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు, మల్టీజోన్–2లో 4వ ర్యాంకు సాధించి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించారు. అదే విధంగా గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మల్టీజోన్–2లో ప్రథమ ర్యాంకు, పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, మల్టీజోన్–2లో 6వ ర్యాంకు, జనరల్ జూనియర్ లెక్చరర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు, బీసీ (ఏ) కేటగిరిలో మల్టీజోన్–2లోను, రాష్ట్ర స్థాయిలోనూ ప్రథమ ర్యాంకు సాధించి వరుసగా నాలుగు గెజిటెడ్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. కృష్ణంరాజు ఒకేసారి నాలుగు ప్రభుత్వ గెజిటెడ్ ఉద్యోగాలను సాధించడం పట్ల అతడి కుటుంభీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ సాధనలో సహకరించిన సన్నిహితులకు కృష్ణంరాజు కృతజ్ఞతలు తెలిపారు.

దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

హాలియా : సమాజంలో ప్రతి విద్యార్థి సినిమా హీరోలను కాకుండా దేశ నాయకులను ఆదర్శంగా తీసుకొని తమ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుకుంటే అప్పుడే సార్థకత కలుగుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్, ఫ్రెండ్స్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో అనుముల మండలంలోని పంగవానికుంటతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు పాఠశాలల విద్యార్థుల ముఖాముఖీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో లక్ష్యాన్ని సాధించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి తమ జీవితాలను బంగారుమయంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్ మార్టిన్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్, మండల విద్యాధికారి బాలునాయక్, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవిత, పర్యావరణ వేత్త సురేష్ గుప్తా, ఫ్రెండ్స్ యూత్ సొసైటీ ఫౌండర్ మెగావత్ కొండానాయక్, అధ్యక్షుడు భరత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అంజి, సాయి, రమేష్, సురేష్, శ్రీను, కార్తీక్, నవీన్ కుమార్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: యువకుడి హత్య కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు అన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం రాత్రి మిర్యాలగూడ తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన రాత్రి 8గంటల సమయంలో మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో వస్కుల జనార్దన్ పెరుగు కొనేందుకు కిరాణం షాపుకు రాగా అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన కుంచం విక్రమ్ పాత కక్షలను మనుసులో పెట్టుకుని జనార్దన్‌తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో విక్రమ్ తన తండ్రి కుంచం పెద్ద శ్రీనుకి ఫోన్ చేయగా అతడితో పాటు తల్లి కుంచం ఎల్లమ్మ, తమ్ముడు కుంచం అజిత్ అక్కడికి చేరుకుని అందరూ కలిసి జనార్దన్‌ను విక్షణారహితంగా కొట్టారు. తీవ్రమైన గాయాలపాలైన జనార్దన్‌ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈ నెల 9వ తేదీన మృతి చెందాడు. మృతుడి అన్న వస్కుల కొండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలరాజు (ఫైల్)

మర్రిగూడ: బైక్ పైనుంచి కిందపడి గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గురువారం మర్రిగూడ ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామం వద్ద బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు కిందపడడంతో ఒకరు మృతిచెందాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన కందుకూరి బాలరాజు(45) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌తండాలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పూల్‌సింగ్ తండాకు చెందిన నేనావత్ భాస్కర్, సక్కు దంపతుల మూడో కుమారుడు నేనావత్ రమేష్(32) పదేళ్ల క్రితం మిర్యాలగూడ మండలం మాటూరు తండాకు చెందిన భారతిని వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో గత ఐదేళ్ల నుంచి భార్య భారతి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రమేష్ గురువారం సాయంత్రం తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

130మంది రైతులకు నోటీసులు

చింతపల్లి : డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి చింతపల్లి మండల కేంద్రంలోని రైతుల నుంచి భూ సేకరణకు ఇరిగేషన్ శాఖ అధికారులు, జిల్లా స్పెషల్ కలెక్టర్ గురువారం సుమారు 130 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలో ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ చేయగా అప్పట్లో కొంత మంది రైతులకు పరిహారంగా రూ.5.15లక్షలు అందించగా, గతంలో మరో 130మంది రైతులు భూసేకరణకు ఒప్పంద పత్రంపై సంతకం చేసినప్పటికీ వారికి పరిహారం అందించలేదు. ప్రస్తుతం 480ఎకరాలకు గాను 130మంది రైతులు గురువారం వ్యవసాయ పనులకు వెళ్లగా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వారి ఇళ్లకు నోటీసులు అంటించారు. దీంతో కంగుతిన్న రైతులు అధికారుల తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5.15లక్షలు పరిహారం అందిస్తామని చెప్పిందని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందించాలని, గతంలో సంతకాలు చేసిన రైతులతో పాటు సంతకాలు చేయని రైతులకు సమానంగా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

- ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

అడవిదేవులపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని నలగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో రూ.70లక్షలతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన వర్గాల బాలికలు చదువుకునేందుకు, మధ్యలోనే చదువు మానివేయకుండా బాల్య వివాహాలను నివారించేందుకు కస్తూరిబా గాంధీ విద్యాలయం ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంఈఓ బాలాజీనాయక్, పోదిల శ్రీనివాస్, కూరాకుల చిన రామయ్య, నాగేశ్వర్‌రావు, బాలునాయక్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, పాఠశాల ప్రత్యేక అధికారిని నాగలక్ష్మి, ఎస్‌ఐ శేఖర్ తదితరులున్నారు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజియన్ సేల్స్ టీం లీడర్ శ్యాంకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో ఆసక్తి ఉన్న వారు రూ.5వేలు, ఇతర ప్రాంతాల్లో ఆసక్తి ఉంటే రూ.1000డీడీ చెల్లించాలన్నారు. వివరాలకు 91542 98690, 91542 98693, 91542 98694, 91542 98695ను సంప్రదించాలని కోరారు.

ముగ్గురు నిందితులకు జైలుశిక్ష

రామగిరి(నల్లగొండ), పెద్దఅడిశర్లపల్లి: హత్య కేసులో నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు తీర్పు వెలువరించారు. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. 2019లో పెద్దఅడిశర్లపల్లి మండలం పోగాకువారిగూడేనికి చెందిన గన్నెబోయిన బుచ్చయ్య(సన్నాఫ్ రాములు), అతడి భార్య, కుమారులపై అదే గ్రామానికి చెందిన వారి పాలివారైన గన్నెబోయిన బుచ్చయ్య(సన్నాఫ్ ఎల్లయ్య), అతడి కుమారులు సైదులు, నాగరాజు గోడ పంచాయితీ విషయంలో గొడవ పెట్టుకొని గొడ్డళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రగాయాలపాలైన గన్నెబోయిన బుచ్చయ్య (సన్నాఫ్ రాములు) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుచ్చయ్య కుమారుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవాణి వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు నిందితులైన గన్నెబోయిన బుచ్చయ్య(సన్నాఫ్ ఎల్లయ్య)కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1500 జరిమానా, సైదులుకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా, నాగరాజుకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, సీఐ ధనుంజయ్య, కోర్టు కానిస్టేబుళ్లు నరేందర్, నాగేష్, మల్లికార్జున్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

నిజాయితీగా ఉన్నందుకే టికెట్ రాలేదు

- ఉచిత బస్సు తప్ప మరేమీ పథకాలు అమలు కాలేదు
- పరీక్షలు వాయిదా వేయాలని వస్తే ఇనుప కంచెలు వేయడం సరైంది కాదు
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



యాదాద్రీశుడి ఆలయంలో మోత్కుపల్లి నర్సింహులు తదితరులు

యాదగిరిగుట్ట: 'ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నా దగ్గర రూ.10కోట్లు ఉంటే ఎంపీ టికెట్ వచ్చేది.. నీతి, నిజాయితీతో ఉన్న కాబట్టే టికెట్ రాలేదు' అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం, యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా భూ కబ్జాలు చేయలేదని, అక్రమాలకు పాల్పడలేదన్నారు. ఇప్పటికీ యాదగిరిగుట్ట పట్టణంలో గజం భూమి లేదని, అదే తన నిజాయితీకి నిదర్శనం అని అన్నారు. ప్రజలయందు వర్ధిల్లు నాయకుడు రాజకీయాలకు పనికి రాడని.. కోట్ల రూపాయాలు సంపాదించిన వాళ్లు నేటి రాజకీయాల్లో ఉంటున్నారన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో 80లక్షలు ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. 11 జనరల్ స్థానాలు ఉంటే.. వాటిలో కూడా ఒకే సామాజిక వర్గానికే అధిక సీట్లు ఇచ్చారని విమర్శించారు. ఒకే కులానికి సీట్లు, పదవులు ఇస్తామంటే బడుగు, బలహీన వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తాను కాంగ్రెస్ పార్టీని బతికించాలనే ఉద్దేశంతో ఆ పార్టీలో చేరానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లకు పడిపోవడం అనేది బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో 16 సీట్లు కాంగ్రెస్ గెలుచుకోవాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో 8 సీట్లకు పడిపోవడం ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు రోడ్లపైకి వస్తే ముళ్ల కంచెలు వేసి పోలీసులు కొడుతున్నారని, ఇది బాధాకరం అని అన్నారు. నిరుద్యోగులకు రూ.5వేల నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. పక్క రాష్ట్రంలో ఉన్న చంద్రబాబునాయుడు మూడు నెలల్లో 16వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నారన్నారు. రెండు నెలల బకాయిలు ఉన్న పింఛన్లు ఒకే రోజులో పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు పక్కన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉందని, తెలంగాణాలో కూడా భట్టి విక్రమార్క ఫొటో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో ఫ్రీ బస్సు పథకం తప్పా.. ఏ పథకాలు ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. అంతకు ముందు కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు.